ప్రజాశక్తి

సోమవారం 19 ఫిబ్రవరి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఎన్నికల ప్రక్రియలో తలమునకలు



శిక్షణలో పోలీసు సిబ్బంది

- క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్‌ల తనిఖీలు
- సిబ్బందికి వివిధ దశల్లో అవగాహన సదస్సులు
- రిటర్నింగ్ అధికారులకు తిరుపతిలో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. మండల స్థాయిలో బదిలీల ప్రక్రియ దాదాపుగా ముగియడంతో అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, అదనపు అధికారులు, పోలింగ్ సిబ్బందికి వివిధ దశలో శిక్షణిస్తున్నారు. తిరుపతి కేంద్రంగా రిటర్నింగ్ అధికారులకు భారత ఎన్నికల కమిషన్ శిక్షణిస్తోంది. సోమవారం నుంచి జరిగే శిక్షణకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చేకూరి కీర్తితో పాటు పలువురు రిటర్నింగ్ అధికారులు తిరుపతి వెళ్లారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది, పోలింగ్ సిబ్బందికి కూడా శిక్షణ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 29లోపు పూర్తి సన్నద్ధతతో ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచించింది.

జిల్లాలో దాదాపు 90 శాతం మంది తహశీల్దార్లు, ఎంపిడివోలు బదిలీ అయ్యారు. వీరిస్థానంలో కొత్త వారు విధుల్లోచేరారు. మూడేళ్లకు మించి పనిచేసిన వారు, సొంత జిల్లాకు చెందినవారిని బదిలీ చేశారు. ఇప్పటికే పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్‌తోపాటు పాటు ఇద్దరు అదనపు ఎస్పిలు, ఆరుగురు డిఎస్పిలు బదిలీ అయ్యారు. గుంటూరు రేంజి పరిధిలో 45 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఉమ్మడి జిల్లా పరిధిలో 40 మంది సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ అయ్యారు. మున్సిపాల్టీల్లోనూ కమిషనర్లు, అదనపు, డిప్యూటీ కమిషనర్లు, మేనేజర్లను బదిలీ చేశారు. తుది విడత బదిలీలు ఈనెలాఖరులోగా ఉంటాయని భావిస్తున్నారు. రిటర్నింగ్ అధికారులుగా నియమితులైన వారు క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల పరిశీలన చేస్తున్నారు. పోలింగ్‌కేంద్రాల్లో మౌలిక వసతులపై విద్యాశాఖ అధికారులతో కలిసి నివేదికలు రూపొందిస్తున్నారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం చేశారు. గుంటూరు జిల్లాలో 17,34,797 మంది ఓటర్లు ఉన్నారు. పల్నాడు జిల్లాలో 17,01,300 ఓటర్లు ఉన్నట్టు నిర్ధారించారు. గతేడాది జులై నుంచి డిసెంబరు వరకు మార్పులు, చేర్పులు అనంతరం 2023 జనవరిలో ప్రకటించిన తుది జాబితాతో పోలిస్తే గత 10 నెలల కాలంలో పెరుగుదల స్వల్పంగా ఉంది. గత జనవరిలో గుంటూరు జిల్లా పరిధిలో 17,11,082 మంది ఉండగా పల్నాడు జిల్లాలో 16,87,820 మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. రెండు జిల్లాల్లో కలిపి గత 10 నెలల కాలంలో గుంటూరు జిల్లాలో 23,715 మంది పెరగ్గా, పల్నాడులో 13,480 మంది మాత్రమే పెరిగారు. ఈ సారి 80 ఏళ్లకు పైగా ఉన్న వారికి ఇంటి వద్దనే ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తున్నందువల్ల వారి జాబితాల పేర్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాల పరిధిలో మంగళగిరిలో అత్యధికంగా 2,78,452 మంది ఓటర్లు ఉండగా తాడికొండలో అత్యల్పంగా 2,01,485 మంది ఓటర్లున్నారు. అధికార యంత్రాంగం మరింత వేగంగా కదిలేందుకు వివిధ స్థాయి అధికారులకు సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారు.



జానపద నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

కన్నుల నిండుగా.. పిల్లల పండుగ..

రెండో రోజూ అదే జోరు.. - ముగిసిన గుంటూరు బాలోత్సవం



8లో

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర అతిథులు

తాగునీటిని నిరంతరం పరీక్షించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో తాగునీటి సరఫరా సమయంలో క్లోరిన్ శ్యాంపిల్స్ క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు అందించాలని మున్సిపల్ అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం స్థానిక శారదాకాలనీ, వసంతరాయపురం, శ్రీనగర్‌లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ప్రత్యేక బృందాలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలసి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. శారదాకాలనీ రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న తాగునీటిలో క్లోరిన్ పరీక్షలను పరిశీలించారు. కాలనీలోని 21వ లైను మార్జిన్, శ్రీనగర్ ఏడవ లైనులో వైద్యారోగ్య శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను, పారిశుధ్య పనులు పరిశీలించారు. వసంతరాయపురం మెయిన్ రోడ్డులో వాల్‌పిట్ శుభ్రత పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిని అన్ని ప్రాంతాల్లో శాంపిల్స్ తీసి పరీక్షలు నిర్వహించాలని, నిర్దేశించిన విధంగా ఫలితాలు లేకపోతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. పైపులైను వాల్‌పిట్ వద్ద నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తీసివేసి శుభ్రంగా ఉంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి పైప్‌లైన్లపై గుర్తించిన లీకులను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలన్నారు. తాగునీటి పైపులైను మరమ్మతు పనుల కారణంగా తాగునీటి సరఫరా నిలిపివేత, పునరుద్ధరణపై ప్రజలకు పూర్తి స్థాయిలో ముందుగా తెలియజేయాలని, ప్రత్యామ్నాయంగా ట్యాంకుల ద్వారా సరఫరా చేయాలని చెప్పారు. నివాస ప్రాంతాల్లో శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసిన భోజనాలు వద్ద అందించే తాగునీటిని వైద్యారోగ్య, మున్సిపల్ శాఖ అధికారులు పరిశీలించి వారికి అవసరమైన సూచనలివ్వాలన్నారు. శ్రీనగర్ ఏడవ లైనులో వాటర్‌ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేదని స్థానికులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఫుడ్ కంట్రోలర్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తాగునీటిపై ఏ సమస్య ఉన్నా జిఎంసి కంట్రోల్ రూమ్ 9000002109 నంబర్‌కు ఫోన్ చేస్తే తగు చర్యలు తీసుకుంటారన్నారు. పర్యటనలో డిఎండ్‌హెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మి, నగర అధికారులు పాల్గొన్నారు.



శారదా కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ కీర్తి

రెంటచింతలలో 36 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - రెంటచింతల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతకు పేరుగాంచిన రెంటచింతలలో ఆదివారం పగటి ఉష్ణోగ్రత 36 డిగ్రీలుగా నమోదైంది. ఫిబ్రవరిలోనే ఇంత అధిక ఉష్ణోగ్రత నమోదు ఈ ఏడాది ఇదే ప్రథమం. వర్షాభావ పరిస్థితులు, నాగార్జున సాగర్‌తోపాటు కాల్వలు, చెరువుల్లో నీరు లేవు. మరోవైపు భూగర్భ జలాలు అందక బోర్లు కూడా ఎండిపోయాయి. ఎండ తీవ్రత మరింత ముదిరి తాము ఎన్ని ఇబ్బందులు పడతామో.. నీటి కోసం ఎన్ని కష్టాలకోర్వాలో అని జనం ఆందోళనకు గురవుతున్నారు.



సభలో మాట్లాడుతున్న అవార్డు గ్రహీత, జర్నలిస్తు పాలగుమ్మి సాయినాథ్

కేంద్రానికి లొంగిన జాతీయ మీడియా

- వెలుగులోకి రాని ప్రజా సమస్యలు
- రైతు ఉద్యమ కవరేజే నిదర్శనం
- నార్ల వెంకటేశ్వరరావు పురస్కార ప్రదాన సభలో పాలగుమ్మి సాయినాథ్

వార్త మెయిన్‌లో



ఘనంగా ఎస్‌ఎల్‌ఎం చైతన్య హైస్కూల్ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని ద్వారకానగర్‌లోగల ఎస్‌ఎల్‌ఎం చైతన్య హైస్కూల్ 19వ వార్షికోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. చిన్నారులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. వక్తలు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకున్న అనేకమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని అన్నారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివి ప్రస్తుతం ఉన్నత స్థాయిలలో ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో ధనేకుల ఇంజనీరింగ్ కాలేజ్ హెచ్‌ఒడి సురేష్, కేంద్ర శాఖ డిప్యూటీ డైరెక్టర్ అశోక్, హైస్కూల్ డైరెక్టర్ సిందే బాలకృష్ణ, ప్రిన్సిపల్స్ సిందే ప్రసాద్, చందు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఖిద్మత్ టీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ భారీర్యాలీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరికి చెందిన ఖిద్మత్ టీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఐదవ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుర వీధుల్లో ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. నిడమర్రు రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ వివిధ ప్రాంతాల్లో తిరిగి అక్కడికే చేరుకుంది. అనంతరం భారీ అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఖిద్మత్ టీమ్ కన్వీనర్ షేక్ షఫీ మాట్లాడుతూ నాలుగేళ్లుగా తమ ఖిద్మత్ టీమ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఖిద్మత్ టీమ్ తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ఆపదలో ఉన్న పేదలకు ఖిద్మత్ టీమ్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, పేదలు ఎదుర్కొనే సమస్యలను తమ ఖిద్మత్ టీమ్ సభ్యుల దృష్టికి తెస్తే తప్పకుండా తమవంతు సహాయం అందజేస్తామని అన్నారు.

అన్నదానం బుక్‌లెట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం అన్నదానం ట్రస్టు కమిటీ సమావేశం పాత మంగళగిరి హుస్సేన్ కట్ట సెంటర్లో కనకదుర్గమ్మ దేవాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని సంబంధించిన బుక్లెట్‌ను ఆవిష్కరించారు. ట్రస్ట్ చైర్మన్ వి.మంగారావు, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరావు, సభ్యులు ఎ.రామకృష్ణారెడ్డి, బి.కోటయ్య, కె.శివాజీ పాల్గొన్నారు.

టిడిపి, జనసేన నుండి వైసిపిలోకి

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

మండల పరిధిలోని ఉప్పలపాడుకు చెందిన టిడిపి, జనసేన పార్టీల నుండి 150 మంది యువకులు దయానంద బాబు, శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కార్యాలయంలో వైసిపిలో చేరారు. వీరిని పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు.



వాలీబాల్ లీగ్-3 విజేత ఈమని జట్టు

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణంలోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం (భోగి ఎస్టేట్స్)లో నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంగళగిరి వాలీబాల్ లీగ్-3 పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. పోటీల్లో మొత్తం 58 జట్లు పోటీ పడగా 570 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మంగళగిరి టౌన్‌కు చెందిన బాప్టిస్ట్‌పేట వాలీబాల్ యూత్ జూనియర్స్ వర్సెస్ దుగ్గిరాల మండలం ఈమనికి చెందిన మన్నం అశోక్ యూత్ మధ్య ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్ విజేతగా ఈమని మన్నం అశోక్ యూత్ నిలిచింది. తృతీయ స్థానం కోసం బీజేఆర్ యూత్ వర్సెస్ వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బీజేఆర్ జట్టు విజయం సాధించింది. అనంతరం టిడిపి-జనసేన నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు వాలీబాల్ కిట్లు, క్రీడాకారులకు టీషర్ట్స్‌ను అందజేశారు. విజేతగా నిలిచిన ఈమని మన్నవ అశోక్ యూత్ జట్టుకు రూ.లక్షను మంచికలపూడి వైష్ణవి, మాలెపాటి పుల్లయ్య చౌదరి అందజేశారు. ద్వితీయ స్థానం సాధించిన బాప్టిస్ట్‌పేట వాలీబాల్ యూత్ జూనియర్స్ జట్టుకు రూ.50 వేలను బొర్రా సాయిఅరవింద్, తృతీయ స్థానం సాధించిన బీజేఆర్ (నిడమర్రు) జట్టుకు రూ.25 వేల బహుమతిని ఇట్టా పెంచలయ్య ఆర్థిక సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు నారా లోకేష్ క్రీడా పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. యువత క్రీడా పోటీల్లో మంచి స్ఫూర్తి కనబరిచారని, ఇదే స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన తెలుగుయువత, టిడిపి నాయకులను ప్రత్యేకంగా అభినందించారు.





బహుమతులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లు

కళ సామాజిక చైతన్యానికి ఉపయోగపడాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ అండ్ జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ఆక్రందన- 'ఏ మిచౌంగ్ తుపాను' అనే అంశంపై చిత్రకారులకు నిర్వహించిన ఆర్ట్ కాంటెస్ట్‌లో విజేత చిత్రాలతో ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమం ఆదివారం ఉదయం రాఘవయ్య పార్క్ ఎదురుగా బాలోత్సవ్ భవన్ మొదటి అంతస్తులో ఘనంగా జరిగింది. చిత్రకళా ప్రదర్శనను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వాతావరణ శాస్త్ర నిపుణులు డా.ఎస్.బి.ఎస్.నరసింహారావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వలన రైతు తీవ్రంగా నష్టపోతున్నారని...ఆ రైతుల ఆక్రంధనను తెలియపరిచేందుకు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ఆక్రంధన 'ఏ మిచౌంగ్ తుపాను' రాష్ట్రం నలుమూలల నుంచి విశేష స్పందన లభించటం చాలా హర్షించదగ్గ విషయమని అన్నారు. కళ సామాజిక చైతన్యానికి ఉపయోగపడేలా ఉంటే ఎన్నో విషయాలను సామాన్య ప్రజలకు చేరేలా చూడొచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షులు ఎ.సునీల్ కుమార్ అధ్యక్షత వహించగా అతిథులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నుంచి ఎం.సూర్యనారాయణ, ఫోరంఫర్ ఆర్టిస్ట్స్ జనరల్ సెక్రటరీ స్ఫూర్తి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నుంచి ఎం.హరిబాబు, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు రైతు సమస్యలు వాటికై కళల ఆవశ్యకత అనే అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిచ్చుకను చేసుకుందామా మచ్చిక అనే నినాదంతో స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంయుక్తంగా నిర్వహించబోతున్న సేవ్ స్పారో జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల పోస్టర్‌ను అతిథుల చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం విజేతలకు క్యాష్ అవార్డులతో పాటు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఉపాధ్యక్షుడు గిరిధర్ అరసవల్లి, ఉప కార్యదర్శి ఎస్.పి.మల్లిక్, మహిళా విభాగం ఇన్చార్జి సంధ్యారాణి, 64 కళలు, కామ్ ఎడిటర్ కళాసాగర్ పర్యవేక్షించగా... వర్కింగ్ కమిటీ మెంబెర్స్ శ్రావణ్ కుమార్, మేడా రజని, నారాయణ రావు, సౌజన్య,లక్ష్మీ ప్రియాంక, సింధూశ్రీలతో పాటు నగరానికి చెందిన పలువురు కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.





ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈ-అబ్యాస్ ప్రతినిధులు

ఆపిల్ స్కూల్లో రాష్ట్రస్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పేరేచర్లలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న ఆపిల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఈ-అభ్యాస్ కలాం ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆదివారం జరిగింది. ప్రతి ఏడాది ఈ అభ్యాస్ అకాడమి హైదరాబాద్ వారు నిర్వహించే 10 వ రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 3 నుండి 10 వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఈ ప్రతిభా పరీక్ష మొదటి లెవెల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 175 ఈ-అభ్యాస్ అనుబంధ స్కూల్‌లోని 35 వేల మంది విద్యార్థులకు నిర్వహించినట్లు ఈ-అభ్యాస్ ప్రతినిధులు తెలిపారు. అందులో అత్యంత ప్రతిభ కనబరిచిన 8 వేల మందిని రెండో దశ పరీక్షను ఏకకాలంలో 9 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 1, 2, 3 ర్యాంకు పొందిన విద్యార్థులకు ఏప్రిల్ 7న గుంటురులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేస్తామని సంస్థ సిఇఒ డాక్టర్ ఈ-అభ్యాస్ ఫణిపవన్ తెలిపారు. ఆపిల్ స్కూల్లో జరిగిన పరీక్షలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 24 పాఠశాలల నుండి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల డైరెక్టర్ ఎం.అజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆపుస్మా రాష్ట్ర నాయకులు కె.వెంకటేశ్వరరావు, మస్తాన్‌రావు, వివిధ పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాలవెల్లువపై రైతులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రైతులకు అధిక ప్రయోజనం కల్పించేందుకు జగనన్న పాలవెల్లువ పథకంలో ఏర్పాటు చేసిన పాల కేంద్రాలకే పాలు పోసేలా పాడిరైతులకు అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. జిల్లాలో మూడవ విడతలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం అమలు చేసిన ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో పాల సేకరణపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, సచివాలయ ఉద్యోగులు, ఏపీ డైయిరీ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఆదివారం సమీక్షించారు. జగనన్న పాలవెల్లువ పథకంలోని పాల కేంద్రాల్లో పాలను విక్రయించటం ద్వారా ప్రతి లీటర్‌కు రూ.20 నుంచి రూ.40 వరకు అదనంగా ఆదాయం వస్తుందని వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో ఏర్పాటు చేసిన 43 పాల సేకరణ కేంద్రాల్లో ప్రతిపూట కనీసం 100 లీటర్లు పాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాలలో నిర్దేశిత స్థాయిలో ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ ఉండేందుకు అవలంబించాల్సిన పద్ధతులపై పశుసంవర్ధక శాఖాధికారులు పాడిరైతులకు తెలియచేయాలన్నారు. రిజిస్టర్ చేసుకున్న పాడి రైతులుందరూ పాలకేంద్రాల్లో పాలుపోసేలా వాలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులు, ప్రమోటర్లు అవగాహన కల్పించాలన్నారు. పాడి రైతులకు వర్కింగ్ క్యాపిటల్ క్రింద తక్కువ వడ్డీకే రుణాలు, పశువుల దాణా సరఫరా చేసేందుకు ఏపీ డైయిరీ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతిరోజు పాలసేకరణపై సంబంధిత శాఖల అధికారలు పర్యవేక్షించి, మరింత మంది పాడి రైతులకు మేలు కలిగించేలా బాధ్యత విధులు నిర్వహించాలన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్యగా నిర్ధారించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి రమేష్, వెనుక వరుసలో ముసుగులో నిందితుడు

ప్రజాశక్తి-తెనాలి

హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 14న అర్ధరాత్రి సమ యంలో గంగానమ్మపేట భవనం వారి వీధికి చెందిన రామిశెట్టి అలేఖ్య (35) హత్యకు గురైన సంగతి తెలిసిందే. మృతురాలి తల్లి కొల్లి అనసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీ సులు అలేఖ్యతో అక్రమ సంబంధం కొన సాగిస్తున్న పట్టణానికి చెందిన అన్నం శ్రీనివాసరావును నిందితుడిగా తేల్చారు. డి.ఎస్.పి రమేష్ పట్టణ టు టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివ రాలను వెల్లడించారు. అన్నం శ్రీనివాసరావు తో దాదాపు పదేళ్ళుగా అలేఖ్య వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుంది. గతంలో అలేఖ్యను శ్రీనివాస్ తీసుకెళ్లాడు. తదుపరి కేసు నమోదు కావడం దానిలో రాజీపడటం జరిగింది. ఇదిలా ఉండగా ఈ పరిణామా లను దృష్టిలో ఉంచుకుని శ్రీనివాస్ భార్య కూడా అతని నుంచి విడాకులు తీసుకుని వెళ్ళిపోయింది.

అయినప్పటికీ శ్రీనివాస్, అలేఖ్యల మధ్య అక్రమ సంబంధం కొన సాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో అలేఖ్య భర్త రమేష్ ను అడ్డు తొలగించేందుకు శ్రీని వాస్ గతంలో హత్యాయత్నం కూడా చేశాడు. ఈ మేరకు కోర్టులో కేసు ట్రైల్ కు వచ్చిన నేపద్యంలో అలేఖ్య భర్తను రాజీకి రావాలంటూ మతురాలి ద్వారా శ్రీనివాస్ మధ్యవర్తిత్వం నడిపించే ప్రయత్నం చేశాడు. దీనికి అలేఖ్య సరిగా స్పందించక పోవడం, పైగా మరొకరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ, తనను దూరం పెడుతుందన్న భావంతో ఆమెను అంత మొందించేందుకు నిర్ణం ఽంచుకున్నాడు. ఈ నెల 14న అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించిన శ్రీనివాస్, పదునైన బ్లేడుతో అలేఖ్య గొంతు కోసి హతమార్చి పరా రయ్యాడు. పోలీసులు దర్యాప్తు నేపథ్యంలో వారికి రాబడిన సమాచారం ప్రకారం ఘటన తరువాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద పార్కు చేసిన వాహనాన్ని తీసుకెళ్ళేందుకు నిందితుడు వచ్చినట్లు తెలుసుకున్న పోలీసులు, అతన్ని అరెస్ట్ చేశారు. కేసును త్వరితగతిన చేదించడంలో చొరవ చూపిన సిఐ ఎ సుధాకర్, ఎస్సై, సిబ్బందిని డిఎస్పీ అభినందించారు.

అమరావతి నూతన ఎస్సై బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-అమరావతి

అమరావతి నూతన ఎస్సైగా పోతుపాలెపు మాచర్ల ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత అమ రావతి సీఐ బ్రహ్మంను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై మాచర్ల మాట్లా డుతూ.. ఇటీవల చిలకలూరిపేటలో విధులు నిర్వహిస్తూ బది లీపై అమరావతి వచ్చినట్లు చెప్పారు. ముఖ్యంగా అమ రావ తిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పై దష్టి సారిస్తామని, వాహన చోదకులు, చిరువ్యాపారస్తులు సహకరించాలని కోరారు.



గుండిమెడ క్వారీలో ఇసుక అక్రమ తవ్వకాలపై టిడిపి-జనసేన నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని తాడేపల్లి మండలం గుండిమెడ ఇసుక క్వారీ వద్ద ఆదివారం టీడీపీ-జనసేన నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. తాడేపల్లి మండల టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో క్వారీలో భారీగా తవ్వేసిన గుంతలను, ఇసుక అక్రమ నిల్వలను వందలాది మంది కార్యకర్తలతో పరిశీలించారు. ముందస్తు సమాచారంతో జేసీబీలు, లారీలు, ట్రాక్టర్లను నిర్వాహకులు దాచిపెట్టడంతో టీడీపీ-జనసేన నాయకులు వాటిని ముళ్ల పొదల్లో గుర్తించారు. కృష్ణానదిలో సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున అక్రమ తవ్వకాలను పరిశీలించారు. అక్రమ మైనింగ్ ఎవరు చేస్తున్నారో తేల్చాలంటూ ఇసుక రాంపులోనే బైఠా యించి నిరసన వ్యక్తం చేశారు. ఇసుక దొంగలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ గుండిమెడలో అడ్డగోలుగా ఇసుక దోపిడీ జరుగుతోందని ధ్వజమెత్తారు. ఇసుక అక్రమ తవ్వకాలు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని, నియంత్రించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రతి రోజు వంద లాది లారీలు, ట్రాక్టర్లతో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి వేల కోట్లు దోచుకుంటున్నారని మండిపడ్డారు. తాడేపల్లి మం డల జనసేన పార్టీ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు మాట్లా డుతూ ఇసుకలో దోచుకున్న డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని జగన్ కుట్రలు చేస్తున్నారని అన్నారు. తాడేపల్లి మండల టీడీపీ అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు చాలా పెద్ద కుంభకోణం అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులకు ఇసుకలోని అక్రమాలు కనిపిస్తున్నాయి. కలెక్టర్లకు ఎందుకు కనిపించడంలేదని ప్రశ్నించారు. టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభాలో 10 శాతం మంది కేన్సర్ బారిన పడే ప్రమాదం


మాట్లాడుతున్న డాక్టర్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

రాబోయే పదేళ్లలో భారతదేశంలోని మొత్తం జనాభాలో 10 శాతం మంది కేన్సర్ బారిన పడే ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ ఎస్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆదివారం అవగాహన ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధిపై డాక్టర్ ఆర్.రామచంద్రరావు అధ్యక్షతన అమెరికన్ ఆంకాలజి ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేన్సర్ అనేది శరీరంలో కొన్ని కణాలు అనియంత్రితంగా అభివృద్ధి చెంది శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించే పరిస్థితి అన్నారు. పొగాకు వాడటం, ఎక్కువకాలం మద్యం సేవించటం, అనారోగ్య ఆహార అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవటం, వాయు కాలుష్యానికి గురి కావటం వంటివి కేన్సర్ కారణాలన్నారు. గొంతుమంట, తరుచుగా దగ్గు, తినేటప్పుడు మింగటంలో ఇబ్బంది, శరీరంలో ఎక్కడైనా గడ్డలు ఏర్పడటం, పుట్టుమచ్చల పెరుగుదల, ఎలాంటి గాయాలైనా దీర్ఘకాలం తగ్గకపోవటం, ఇబ్బందికర మూత్ర విసర్జన వంటివి కేన్సర్ లక్షణాలని వివరించారు. పండ్లు, కూరగాయలు, తక్కువ ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే కేన్సర్‌ను అడ్డుకోవచ్చని చెప్పారు. అనంతరం డాక్టర్ ప్రతాప్‌రెడ్డిని అవగాహన సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, విద్యాదర కుమార్ ప్రసంగించారు.

22న ధాన్యం బకాయిల కోసం సామూహిక రాయబారం



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం

ధాన్యం బకాయిల కోసం ఈనెల 22వ తేదీన 10గంటలకు విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్ద సామూహిక రాయబారం కార్యక్రమం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు తెలిపారు. ఆదివారం గన్నవరంలోని సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వ్యవసాయం దినదిన గండంగా మారుతుందని, పంట విత్తిన రోజు నుండి, చేతికి వచ్చేవరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. ఎరువులు, పురుగుమందుల ధరలు అందుబాటులో ఉండటం లేదన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో, ట్రాక్టర్ కిరాయిలు, కోత, పొత యంత్రాలు, స్ప్రేయర్ల కిరాయి ఖర్చులు పెరిగిపోతున్నాయనీ చీడ, పీడలు ప్రకతి వైపరీత్యాలు వెంటాడుతున్నాయని చెప్పారు. ఈ సంవత్సరం సీజన్ ప్రారంభంలో అధిక వర్షాల వలన, నారుమళ్ళు, ఎద జల్లినవి, నాట్లు వేసినవి డ్రైనేజ్ సౌకర్యం సరిగ్గా లేక మునిగిపోవడంతో, తిరిగి మరల నాట్లు వేయడానికి రెండు రెట్లు ఖర్చు పెరిగిందన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను రావటంతో పనల మీద ఉన్నవని , నిలువు మీద ఉన్నవి కూడా నీటిలో నాని, రైతు విపరీతంగా నష్టపోయి, నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ధాన్యం రంగు మారి, పాయ రావటంతో, మిల్లర్లు, మధ్య దళారులు ధర తెగ్గోసి కొన్నారన్నారు. ఇన్ని కష్టాల మధ్య ఆర్. బి. కే ల ద్వారా ధాన్యం అమ్మితే జనవరి 13 తర్వాత రైతు ఖాతాలలో ఇప్పటివరకు నగదు జమ కాలేదన్నారు. దీనితో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, కుప్ప నూర్పిడి చేసిన ట్రాక్టర్ కిరాయిలకు, వ్యవసాయ కార్మికులకు, రెండో పంటగా సాగు చేస్తున్న మినుముకు మందుల కొనుగోలుకు అప్పుల కోసం తిప్పలు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. కావున ధాన్యం బకాయిల కోసం ఈనెల 22వ తేదీన విజయవాడ రాష్ట్ర సివిల్ సప్లై ఆఫీస్ వద్ద జరిగే, సామూహిక రాయబార కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఐఒటి స్మార్ట్ సెంట్రల్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ టెలికాం సంస్థ 'వి' ఎంటర్‌ప్రైజెస్ విభాగం ఆధ్వర్యంలో ఐఒటి స్మార్ట్ సెంట్రల్‌ను ప్రారంభించినట్లు సంస్థ బిజినెస్ హెడ్ అమిత్ కుమార్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని వి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలిపారు. భవిష్యత్తు తరాల కోసం, స్వీయ సంరక్షణ, సాంకేతిక కారణాల సమస్యలను అధిగమించేందుకు స్మార్ట్ సెంట్రల్ ఉప యోగపడుతుం దని తెలిపారు. రియల్ టైమ్ ప్రాతిపదికగా రిమోట్‌గా ఐఒటి ఆస్తులను నియంత్రించడానికి, పర్యవేక్షించ డానికి, స్మార్ట్ సెంట్రల్ కనెక్టివిటీ ఉపయోగ పడుతుందన్నారు.



కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి- తాడికొండ

కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి 9 నందిని అదుపులోకి తీసుకున్న ఘటన ఆది వారం చోటుచేసుకుంది. సీఐ సిహెచ్ ప్రభాకరరావు వివరాల ప్రకారం మండలంలోని కంతేరు గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా కోడిపందాలు నిర్వహిస్తున్నారు అన్న సమాచారం మేరకు, స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 20,700 రూపాయలు, రెండు కోళ్ళ 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.



శుభకార్యంలో బాణసంచా పేలుడు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటోలని అరండల్ పేట అన్నపూర్ణమ్మ హాస్పిటల్ లైన్ లో ఒక గృహంలో జరుగుతున్న శుభ కార్యం లో బాణాసంచా పేలుస్తుండగా ప్రమాదవశాత్తు బాణ సంచా నిల్వ చేసి ఉన్న వాహనంలో నిప్పు రవ్వలు పడడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్పందించిన అగ్ని మాపక శాఖ అధికారులు సకాలంలో మంటలను అదుపు చేశారు. నివాసగృహాలు ఉన్న ప్రాంతంలో ఒక్కసారిగా బాణసంచా పేలి భారీ స్థాయిలో శబ్దం రావడంతో స్థాని కులు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశామని పరిసరాలు మొత్తం పొగ కమ్ముకుని ఉండడంతో అర్థం కాని పరిస్థితి నెలకొందని చెప్పారు.



వెన్నెల సూపర్‌మార్కెట్లో చోరీ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్‌లోని వెన్నెల సూపర్ మార్కెట్లో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. వెనుక భాగం నుంచి లోనికి ప్రవేశించిన దొంగలు కౌంటర్‌లో ఉన్న రూ.10 వేలు దొంగిలించారు. షాపు యజమాని బాబు తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిసి టివి ఫుటేజ్‌ని పరిశీలించడంతో పాటు కేసు నమోదు చేసి తాడేపల్లి సిఐ మధుసూదనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





గుంటూరు బాలోత్సవంలో ప్రతిభ చాటిన వేల్పూరు విద్యార్థులు

బాలోత్సవంలో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-వినుకొండ

గుంటూరు బాలోత్సవంలో శావల్యాపురం మండలం వేల్పూరు విద్యార్థులు ప్రతిభ చాటారు. జానపద నృత్యం సీనియర్ ప్రథమ స్థానంలో, మ్యాప్ పాయింటింగ్ లో రెండో బహుమతి, కోలాటంలో కన్సోలేషన్ బహుమతి అలాగే మ్యాప్ పాయింటింగ్ లో సాయి చైతన్య రెండో బహుమతి సాధించగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కోలాటం లో జానపద నత్యంలో బహుమతులు సాధించిన విద్యార్థుల పేర్లు త్రిష,నాగ రోషిని,లక్ష్మీ హారిక శ్రీలత ,హేమలత,తులసి ప్రసన్న సంధ్య, శ్రీవల్లి, గాయత్రి మస్తాన్ .,శ్రావణి,అక్షయ, జయశ్రీ, జానపద నృత్యంలో ప్రథమ బహుమతి సాధించిన వారు వివేక్,శ్రీలత , రేణుక, ప్రసన్న సంధ్య,లక్ష్మీ హారిక నాగరోషిని,అక్షయ , శ్రావణినిహెచ్ఎం సుభాని, చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు అభినందించారు. గైడ్ టీచర్ గా శ్రీనివాస్‌రావు వ్యవహరించారు.

మృతుల ఓట్లు తొలగించాలి

ప్రజాశక్తి - రెంటచింతల

ఇటీవల వెల్లడైన ఓటర్ల జాబితాలో ఉన్న మృతి చెందిన వారి పేర్లను వెంటనే తొలగించాలని తహశీల్దార్ ఎస్.రామ్మోహనరావు ఆదేశించారు. ఆదివారం బిఎల్ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ ఎంట్రీ ఓట్లు ఎక్కడా ఉండడానికి వీల్లేదని అన్నారు. నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో డిటి బ్రహ్మయ్య, ఆర్ఐ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కడియాలకు కేకు తినిపిస్తున్న ఆంజనేయులు, అరవిందబాబు

ఘనంగా కడియాల పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు కడియాల హాస్పిటల్ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు నరసరావుపేట నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు డాక్టర్ కడియాలకు కేకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. గత 7 నెలలుగా పల్నాడు రోడ్డులో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా భోజనం అందించడం పట్ల జివి ఆంజనేయులు డాక్టర్ కడియాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు,వేల్పుల సింహాద్రి యాదవ్, కడియాల కుమారుడు డాక్టర్ లలిత్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ సమయంలో ప్రిపరేష(షా)న్!

- టెట్ పరీక్షా విధానంపై విమర్శలు
- కనీసం 40 నుంచి 60 రోజుల సమయం కావాలి
- 19 రోజుల్లో చదివి పరీక్షకు హాజరుకాలేం : నిరుద్యోగ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన టెట్ పరీక్షలు విధానాన్ని చూస్తుంటే నిరుద్యోగ ఉపాధ్యాయుల కన్నీళ్లు తుడవటానికా అన్నట్లుగా ఉందని పట్టణంలోని పలువురు నిరుద్యోగ ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. పట్టణంలో, నియోజకవర్గ స్థాయిలో బిఇడి,డిఎడ్‌లకు అర్హులైన వారు సుమారు నాలుగు నుంచి ఐదు వేల మంది వరకు ఉన్నారు. వీరిలో వయ స్సు అర్హత కోల్పోబోతున్న వారి సంఖ్య వందల్లో ఉన్నట్లు అంచనా. ఈ నెల 8వ తేదీన పరీక్ష విధానాన్ని ప్రకటించి ఇదే నెలలో 27వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తామనడం దారుణమైన విషయం అన్నారు. నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచి సుమారు 19 రోజులకే టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షలను ప్రభుత్వం నిర్వహించడంతో దానిలో పాల్గొని పరీక్షలు రాసేందుకు సమయం ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. టెట్ పరీక్షలకు సిద్ధం కావాలంటే కనీసం 40 నుంచి 60 రోజులపాటు చదువుకోవాల్సి ఉంటుందని, అటువంటిది 19 రోజులలో చదివి పరీక్షలకు హాజరు కావడం కష్టమని అంటున్నారు. టెట్‌లో అర్హత సంపాదించిన ఉపాధ్యాయులకు డిఎస్సీ నిర్వహించేందుకు కూడా సమయం ఇవ్వకపోవడం దురదృష్టకరమంటున్నారు. దీనికి కూడా సిద్ధం కావాలంటే కనీసం 60 రోజులు సమయం పడుతుందంటున్నారు. ఇప్పటికే వయస్సు నిబంధన వర్తించే వారున్నారని, అలాంటి వారికి ఈ అవకాశం కూడా చేజారిపోతే భవిష్యత్తులో ఉద్యోగాలపై ఆశ వదులుకోవాల్సి వస్తుందని అంటున్నారు. ఒక పేపర్‌కి రూ.750 కడితే 1 నుంచి 5 వ తరగతుల వరకు గాని 1 నుంచి 5వ తరగతిలో పాటుగా 6 నుంచి 8 వరకు కూడా కలిపి బోధించేందుకు అవకాశం కోసం ఈ రెండో పేపర్ రాయాల్సి ఉంటుంది. రెం డు పేపర్లు రాయాలంటే రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. ఇంకా చదువుకునేం దుకు, ఫొటోలు, జిరాక్స్, ఆన్లైన్ లో పొందు పరిచేందుకు ఒకొక్కరికి కనీసం ఆరువేల నుంచి ఎనిమిదివేల వరకు ఖర్చవుతాయని, నిరుద్యోగులకు కనీస చార్జీలు, మెటీరియల్ ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

మొత్తం పోస్టులు విడుదల చేయండి

ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుడు జాఫర్



మరో రెండేళ్లలో వయసు రీత్యా అర్హత పోతుందని, తనలాంటి వారు చాలా మంది ఉన్నారని ప్రయివేటు స్కూల్ ఉపాధ్యాయుడు జాఫర్ చెప్పారు. జరగబోయే పరీక్షలు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్ లైన్‌లో నిర్వహిస్తే బాగుంటుందని అభి ప్రాయపడ్డారు. కనీసం నోటిఫికేషన్ విడుదల తేదీ నుంచి 45 రోజుల తరువాత పరీక్షలు పెట్టే విధానం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 50 వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రస్తుత డీ ఎస్సీకి మొత్తం పోస్టులు విడుదల చేయా లన్నారు. పరీక్ష పాస్ అర్హత శాతాన్ని తగ్గించాలని, అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు.



పల్నాడు జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులుగా నరసరావుపేటకు చెందిన ఎంవి వేణు మాధవరావు , జనరల్ సెక్రె టరీగా సత్తెనపల్లికి చెందిన ఆర్‌వి మల్లి కార్జున రావు, కోశాధికారిగా చిలకలూరిపేటకు చెందిన కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులుగా నరసరావు పేటకు చెందిన కెపి రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నరసరావుపేట లోని భువనచంద్ర టౌన్ హాల్‌లో జనరల్ బాడీ సమా వేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెమిస్ట్,డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఇటీవల కెమిస్ట్ డ్రగ్గిస్ట్ జిల్లా కార్యా లయానికి కలెక్టర్ శివ శంకర్ సహకారంతో 6 సెంట్లు స్థలం కేటాయించినట్లు చెప్పారు. త్వరితగతిన జిల్లా కార్యాలయ భవన నిర్మాణం చేయాలని కోరారు. మెడికల్ రంగంలో అవినీతికి తావు లేకుండా పల్నాడు జిల్లా కమిటీ సేవాభావంతో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని అన్నారు. కెపి రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ షాపులకు ఏసీలు పెట్టించాలనే నిబంధనను అమలు చేయమని చెబుతోందని, దానికి అను గుణంగా మెడికల్ షాపులకు డొమెస్టిక్ కరెంటు కనెక్షన్స్ ఇప్పించాలని ఎమ్మెల్యేని కోరారు. స్పందిం చిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని తప్పనిసరిగా ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్య పరిష్కంచే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పివి రత్నం, సీమాంధ్ర డగ్గు డీలర్స్ అసోసియేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ డి. కృష్ణారెడ్డి పాల్గొని మాట్లా డారు. పల్నాడు జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసో సియేషన్ కార్యవర్గ సభ్యులుగా మాచర్లకు చెందిన శివన్నారాయణ, దాచేపల్లి కి చెందిన మోహన్ రావు, చిలకలూరిపేటకు చెందిన సుధాకర్, పిడుగురాళ్ల కు చెందిన మోహనరావు, సత్తెనపల్లి కి చెందిన సత్యనారాయణ, వినుకొండకు చెందిన కామేశ్వరరావు ఎన్నికయ్యారు.

కాంపౌండర్లు, నర్సుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్రంలో వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో దాదాపు ఏడు లక్షలకు పెగా కాంపౌండర్, నర్సులుగా పని చేస్తున్నారని రాబోయే కాలంలోనైనా వారికి కనీస భద్రత కల్పించాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొండ్రముట్ల నాగేశ్వరరావు కోరారు. మాజీ మంత్రి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావును ఆదివారం పండరీపురంలోని ఆయన నివాసంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంపౌండర్లు, నర్సులతో ఆయా ఆసు పత్రుల యాజమాన్యం వెట్టిచాకిరి చేయించుకుంటూ, అమా నుషంగా ప్రవ ర్తిస్తు న్నారని, ప్రశ్నించిన ఉద్యోగులను ఉద్యోగం నుండి తొలిగిస్తున్నారని అన్నారు. ఆసుపత్రులలో నర్సు లుగా కొనసాగే వారందరూ బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనారిటీలకు చెందిన వారే కాక పేదలు,నిరుపేద లు,



ప్రత్తిపాటి పుల్లారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొద్ది పాటి చదువు ఉన్న వారే ఉన్నట్లు చెప్పారు. కరోనా కాలంలో వారు ఎక్కువగా కష్ట పడ్డారన్నారు. ప్రభుత్వాలు వారికి కనీస సదుపాయాలు కల్పించలేదని, కాంపౌండర్స్,నర్సులకు తగిన న్యాయం చేయాలని కోరు తూ ఏడు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. పుల్లారావు మాట్లాడుతూ వారి సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు.కార్యక్రమంలో ఎ.వెంకట్, జి.నరసింహారావు, మొహిద్దిన్, వినోద్, బి. నాగరాజు పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థతో పాలనా సౌలభ్యం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వాలంటీర్ వ్యవస్థతో పాలనా సౌలభ్యం సులభతరం అవుతుందని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలాజీ కళ్యాణ మండపం నందు వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పిడుగురాళ్లలో గత నాలుగేళ్లు సేవా వజ్ర అందుకుంటున్న వాలంటీర్ రంజిత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం



వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పిడుగురాళ్లలో సేవ వజ్రా 1, సేవారత్న5 మరియు సేవా మిత్ర 305 మొత్తంగా 311 వాలంటీర్లకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్,మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు,వైస్ చైర్మన్ ముక్కంటి,కౌన్సిలర్లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. పిడుగు రాళ్లలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని గతంలో కనీసం ఆరు పడకల ప్రభుత్వ వైద్యశాల కూడా లేదని మరొక వారం పది రోజుల్లో వంద పడకలతో మెడికల్ కళాశాల లో ఫేజ్ వన్ లో ప్రారంభించబోతున్నామని, ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు కూడా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని మార్చి నెల మొదటి వారంలో బైపాస్ ను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

పులిచింతల నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి పట్టణంలోని ఐదవ వార్డులోని పులిచింతల నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వాసిత కేంద్రం నందు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ పట్టాలు స్థలాలు కుటుంబ అవసరాల నిమిత్తం అమ్ముకోవాలన్న 50 వేలు కూడా తీసుకునేవారు లేరని రిజిస్ట్రేషన్లు అయిన తర్వాత ఐదు లక్షల పైగా బ్యాంకులో రుణాలు ఇస్తామని వస్తున్నాయన్నారు. మరొక ఆరు నెలలు స్థలాలు ఇల్లు కానీ అమ్ముకోవద్దని ఆరు నెలల వ్యవధిలో రైల్వే అండర్ పాస్ నిర్మించనున్నట్లు చెప్పారు. రానున్న రెండు నెలల్లో నిర్వాసిత కేంద్రానికి దగ్గరలో ఉన్న రాజన్న కాలనీలో ఇళ్ల,పట్టాల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం టిడిపి నుండి వైసిపిలోకి 50 కుటుంబాలు చేరాయి.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో అక్షయ విద్యాలయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని అక్షయ స్కూల్ విద్యాలయం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానాన్ని సంపాదించింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, సుగుణ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అక్షయ విద్యాలయంలో 200 మందికి పైగా విద్యార్థులు ఒకేచోటకు చేరి 'ఎలక్ట్రానిక్ కార్ రిజర్వ్ హార్న్' అనే ప్రయోగాన్ని విజయవంతంగా రూపొందించినందుకు గాను ఈ రికార్డును అక్షయ విద్యాలయం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అందజేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ సిహెచ్ వెంకటాచారి, స్టేట్ కో-ఆర్డినేటర్ బి.రామారావు, సుగుణ సైన్స్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ సిహెచ్ సాంబశివరావు, పి.వేణుగోపాలరావు, అక్షయ విద్యాలయం చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి, కరస్పాండెంట్ వెలగా శ్రీవల్లి, ఉప్పుల రంగారావు పాల్గొన్నారు.



బాలోత్సవంలో అక్షయ విద్యార్థులకు బహుమతులు

గుంటూరులో శని, ఆదివారాల్లో నిర్వహించిన గుంటూరు జిల్లా బాలోత్సవంలో అక్షయ విద్యాలయం విద్యార్థులు పలు బహుమతులు సాధించారు. వెస్టర్న్ డ్యాన్స్ జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి, జానపద నృత్యం జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి, మట్టితో బొమ్మలు (క్లేవ్ ఆర్ట్) తయారీ పోటీల్లో తృతీయ బహుమతి, ఏకపాత్రాభినయంలో కన్సోలేషన్ బహుమతులు పొందారు. వీరిని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అభినందించారు.



సిఐటియు మంగళగిరి రూరల్ మండలం నూతన కమిటీతో నాయకులు

కార్మికుల్ని మళ్లీ బానిసల్ని చేసే కుట్రలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్యంగా పోరాడాలి : సిఐటియు

ప్రజశక్తి-మంగళగిరి రూరల్

కార్మిక ఐక్యత ద్వారానే కార్మిక హక్కులను సాధించుకోగలం సిఐటియు మాజీ నాయకులు ఈమని అప్పారావు అన్నారు. సిఐటియు మంగళగిరి రూరల్ కమిటీ విస్తృత సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అప్పారావు మాట్లాడుతూ దేశంలో ఎంతోమంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని, కార్మికులకు రక్షణగా ఉండే అనేక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే నాలుగు లేబర్‌కోడ్‌లను తెచ్చిందని చెప్పారు. వీటివల్ల కార్మికులను బానిసలుగా మారే ప్రమాదముందని, ఈ పరిస్థితుల్లో కార్మికులు ఐక్యంగా ఉండి కార్మిక సంఘాలను ఏర్పరచుకొని హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ కార్మికులు బానిసలుగా 18 గంటల పని చేయాల్సిన దుస్థితిని అనుభవిస్తున్న రోజుల్లో కార్మికులు తిరగబడి పోరాటాల ద్వారా 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారని వివరించారు. కానీ నేటి పాలకులు మరల కార్మికులను 12 గంటలు 15 గంటలు పని రోజులకు తీసుకెళ్తున్న పరిస్థితులు మోడీ, జగన్మోహన్‌రెడ్డి పాలనలో వస్తున్నాయని విమర్శించారు. ఈ విధానాలను పోరాటాలతో తిప్పికొట్టాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా చీమలదండు పార్వతి, వుద్దంటి దుర్గారావు, ఉపాధ్యక్షులుగా బద్దిల ఆనంద్, నూతక్కి స్వర్ణ, సహాయ కార్యదర్శులుగా కుక్కమళ్ల రాజేశ్వరి, ఎం.నాగరాజు, కోశాధికారిగా వట్రం పూర్ణయ్య, కమిటీ సభ్యులుగా కత్తుల సురేష్, ఎన్.జోజిరాణి, జి.నాగేశ్వరావు, దుపాటి బుల్లిబాబు, కాజా రామయ్య, కె.కృష్ణ, శివకుమారి, నాగేంద్రబాబు, నాగయ్య ఎన్నికయ్యారు.



కృష్ణవేణికి సన్మానం చేస్తున్న డాక్టర్ రావి రంగారావు, పాణిరావు

శ్రమకు అక్షరాభిషేకం.. శివకుమార్ కవిత్వం

ప్రజాశక్తి-గుంటూరు

శివకుమార్ కవిత్వం శ్రమకు అక్షరాభిషేకం అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు అన్నారు. 'అమరావతి సాహితీ మిత్రులు' ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్ఒ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం నిర్వహించిన సాహిత్య సభలో ఆయన 'పేరిసెట్ల శివకుమార్ కవిత్వం' గురించి ప్రసంగించారు. శ్రామికులు, కర్షకులు, గ్రామీణ జీవనం, నగరీకరణ దుష్ప్రభావం, ఆధునిక సమాజంలోని వెర్రిపోకడలను శివకుమార్ కవిత్వంగా వెలువరించారన్నారు. సరికొండ నరసింహరాజు కవితల సంపుటి 'తల్లడిల్లే తల్లివేరు' గురించి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మైలవరపు లలితకుమారి ప్రసంగిస్తూ మాతృభాష విలువ, దేశభక్తి గురించి, సామాజిక సమస్యల గురించి చక్కగా రాశారన్నారు. 'ఈ మాసం కవి'గా పరాంకుశం కృష్ణవేణి (ఒంగోలు) పాల్గొని అనేక కవితల్ని వినిపించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహణలో జరిగిన కవితా పఠన కార్యక్రమంలో విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, వి.వి.రావు, చల్లా సత్యవతి, రేపల్లె రాజ్‌కృష్ణ, గడల శివప్రసాద్, వెదుళ్లపల్లి పల్లి సాంబశివరావు, ధనుంజయరెడ్డి, మేడిశెట్టి యోగేశ్వరరావు (మచిలీపట్నం), ఎస్ కనకదుర్గ, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, కనగాల జయకుమార్, షేక్ రహీం సాహెబ్ (తెనాలి), సౌపాటి ప్రభాకర్, కమలారామ్ (వినుకొండ) మొదలైన కవులు పాల్గొన్నారు. అనంతరం ఈ మాసం కవి కృష్ణవేణిని, నిక్కచ్చి కవితకు ఎంపికైన డాక్టర్ సూర్యదేవర రవికుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో యర్రగుంట్ల పాణిరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో సమన్వయం కుదిరేనా..?



ప్రజాశక్తి - తుళ్లూరు

తాడికొండ నియోజకవర్గ వైసిపిలో నాయకుల మధ్య 'సమన్వయం' కుదిరేనా..? అనే చర్చ జోరుగా సాగుతోంది. మాజీ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అయిన వైసిపి నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న మేకతోటి సుచరిత, మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షునిగా ఉన్న డొక్కా మాణిక్య వరప్రసాద్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రస్తావిస్తున్నారు. ఇద్దరి వ్యవహారశైలి ఎడమొఖం - పెడమొఖం చందంగా ఉందని అంటున్నారు. పార్టీ అధిష్టానం పదేపదే సమన్వయకర్తలను మార్చడమే తప్ప దానివల్ల జరుగుతున్న పరిణామాల గురించి పట్టించుకోవడం లేదని కొందరు నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తొలుత ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ప్రాధాన్యతను తగ్గిస్తూ నియోజకవర్గ సమన్వయకర్తగా మాణిక్య వరప్రసాద్‌ను అధిష్టానవర్గం నియమించింది. దీంతో నాయకులు, కార్యకర్తలు రెండు గ్రూపులుగా ఏర్పడి పోటా పోటీగా కార్యక్రమాలు నిర్వహించారు. తాడికొండలో ఈ రెండు గ్రూపులూ బాహాబాహీ తలపడే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ అధిష్టానం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. మాణిక్యవర ప్రసాద్ తాడికొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేసి రెండుసార్లు గెలుపొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో సెకండరీ విద్యాశాఖ మంత్రిగా, కిరణ్‌కుమార్ రెడ్డి మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. తనకు నియోజకవర్గంలో ఉన్న పట్టు, జగన్ సాన్నిహిత్యం తదితర కారణాల రీత్యా తాడికొండ అసెంబ్లీ సీటు తనకే దక్కుతుందనే ఆశతో మాణిక్య వరప్రసాద్ ఉన్నారు. తాను గెలిచి తాడికొండ సీటును జగన్ మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇస్తానని పదేపదే చెబుతూ వచ్చారు. అధిష్టానం మాత్రం జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా ఉన్న కత్తెర హెనీ క్రిస్టినా భర్త సురేష్‌కుమార్‌ను చడీచప్పుడు లేకుండా సమన్వయకర్తగా నియమించింది.

శ్రీదేవి, వరప్రసాద్ మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండగానే అధిష్టానం సమన్వయ కర్తగా సురేష్ కుమార్‌ను నియమించడంతో గందరగోళం నెలకొందని కార్యకర్తలు వాపోతున్నారు. పార్టీ అధిష్టానం తనకే ఎమ్మెల్యే సీటు ఇస్తుందని, ఆ మేరకు తనకు హామీ లభించిందని సురేష్ కుమార్ ప్రచారం చేసుకున్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి వ్యవహార శైలిపై అసంతృప్తి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి అనుకూలంగా ఓటు వేశారనే ప్రచారం నేపథ్యంలో ఆమెను వైసిపి నుంచి బహిష్కరించడం, తర్వాత ఆమె టిడిపిలో చేరిన నేపథ్యంలో కొంతమంది కార్యకర్తలు సురేష్ కుమార్ వెంట, కొంతమంది వరప్రసాద్ వెంట నడుస్తూ వచ్చారు. కార్యకర్తలు రెండు గ్రూపులుగా ఏర్పడిన సంగతి పార్టీ పెద్దలకు తెలిసినా సరిదిద్దే ప్రయత్నం చేయలేదని కొంతమంది నిరసన గళం వినిపిస్తూ వచ్చారు.

పదేపదే సమన్వయకర్తలను మార్చడం వల్ల నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం నెలకొందనే విమర్శలు చోటుచేసుకున్నాయి. అయినా అధిష్టానం పట్టించుకోక పోగా సురేష్‌కుమార్‌ను కాదని సుచరితను సమన్వయకర్తగా నియమించింది. దీంతో సురేష్‌కుమార్ నియోజకవర్గానికి పూర్తిగా దూరమయ్యారు. వరప్రసాద్ మాత్రం జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతూ అడపా దడపా నియోజకవర్గంలో జరిగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. టికెట్ నీకేనని సిఎం, పార్టీ పెద్దలు చెప్పారని, సర్వేల్లో సరిగ్గా లేదని నన్ను సంప్రదించకుండా వారం రోజుల్లోనే సుచరితను నియమించారని ఇటీవల తాడికొండలో జరిగిన సభలో డొక్కా ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పెద్దలను కలిసే అవకాశం కల్పించాలని కోరి నెలలు గడిచినా పార్టీ పెద్దల నుంచి పిలుపు రాలేదు.

హెనీ క్రిస్టినా గతంలో తాడికొండ నియోజకవర్గం నుంచి పోటీచేశారు. సురేష్ కుమార్ సమన్వయకర్తగా కొద్దినెలల వరకు పనిచేశారు. వరప్రసాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా నియోజకవర్గ ప్రజలకు చిరపరిచితులే. వరప్రసాద్, సురేష్‌కుమార్ మద్దతు వైసిపి గెలుపునకు చాలా అవసరం ఉంటుందని, సమన్వయకర్తలుగా నియమించి తొలగించడంతో వారితో పాటు కార్యకర్తల్లో అసంతృప్తి ఉంటుందని గ్రహించి అధిష్టానం సరిదిద్దే ప్రయత్నం చేయాలని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి. నాయకుల మధ్య సమన్వయం కుదిరేలా చర్యలు చేపట్టకుండా కార్యకర్తల మధ్య ఐక్యత ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. కార్యకర్తల్లో నెలకొన్న గందరగోళం,ఇతర అంశాలను పార్టీ పెద్దల దృష్టికి తెచ్చే పరిస్థితి కూడా పార్టీలో లేదని సీనియర్ నాయకుడొకరు చెప్పారు.'ఎన్నికలకు ఎంతో సమయం లేదు.. పార్టీలో పరిస్థితులను చక్కదిద్దకపోతే నష్టం తప్పదని ఆయనన్నారు.

'అమరావతిని నిర్మించుకుందాం'

ప్రజాశక్తి - తుళ్లూరు

'అధికారంలోకి వచ్చేది టిడిపినే.. అమరావతి నిర్మాణం జరుగుతుంది.. ఇందులో అనుమానాలేమీ లేవు..' అని నారా లోకేష్ భరోసా ఇచ్చారని అమరావతి దళిత జెఎసి, టిడిపి నాయకులు పులి చిన్నా తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో శంఖారావం సభ సందర్భంగా నారా లోకేష్‌ను పులి చిన్నా కలిశారు. ఇటీవల లోకేష్ జన్మదినం సందర్భంగా కృష్ణానదిలో 100 అడుగుల కటౌట్ చిత్రాన్ని ఫొటో ఫ్రేమ్ రూపంలో లోకేష్‌కు చిన్నా అందజేశారు.



లోకేష్‌కు చిత్రపటాన్ని ఇస్తున్న పులి చిన్నా

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ (ఎమ్‌టిఎంసి) పరిధిలోని కాజా వద్ద పుల్లయ్య చెరువు ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని కమిషనర్ నిర్మల్‌కుమార్ పేర్కొన్నారు. వచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించి ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో పోలీసుల సహకారంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది డిప్యూటీ సిటీప్లానర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఆక్రమణలను ఆదివారం తొలగించారు. కార్యక్రమములో టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రమేష్, టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు.



పనిభారంతో సతమతం

• కార్యాలయపు పనులు పెండింగ్ • సంబంధం లేని పనులతో ఇబ్బంది • సచివాలయాల సిబ్బంది ఆవేదన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కార్యాలయ పని గంటలతో సంబంధం లేకుండా రోజుకి పదిహేను లేదా పదహారు గంటలపాటు పనులు చేయాల్సి వస్తోందని పట్టణంలోని 29 సచి వాలయాల సిబ్బంది అడ్మిన్, కార్యదర్శి, మహిళా పోలీసు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అన్ని శాఖల వారు చెబుతున్నారు. తమకు సంబంధం లేని పనులు కూడా చేయిస్తున్నారని అంటున్నారు. వన్‌టైన్ సెటిల్‌మెంట్ కింద డబ్బు వసూళ్లు, కులగణన, టిడ్కో ఇళ్లకు, జగనన్న కాలనీల్లో పరిశీలన, ప్రతి ఇంటిని కొలిచి పన్నులు వేయడం వంటి మొదలైన పనులు తమవి కాదని, అయినప్పటికీ తమతో చేయిస్తున్నారని చెబుతున్నారు. తమపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళు ఒక వైపు, అధికారుల ఒత్తిళ్లు మరోవైపు ఉంటున్నాయని వాపో తున్నారు. ప్రభుత్వ పరమైన ఏ చిన్న సర్వే గానీ, ఏ ఇతర పని చేయాలన్న ప్రభుత్వ ఉన్నతాధికారులు తమతోనే చేయిస్తుండటంతో విరామం కూడా ఉండటం లేదని, దీంతో, సచి వాలయాల్లో రోజువారీ చేయాల్సిన పనులు పెండింగ్ పడుతున్నాయని అంటున్నారు. పైగా సచివాలయ పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నా యని పైఅధికారులు తమను ప్రశ్నిస్తుండట విడ్డూరంగా ఉందని, అధికారులకు సమాధానం చెప్పలేక, ఉద్యో గాలను మానలేక సతమతమౌతున్నామని సచివాలయాల సిబ్బంది చెబుతున్నారు. పూర్తి స్థాయిలో పనులు చేయలేక. సెలవులు తీసుకోలేక అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించాలని, సచివాలయ పనులు మాత్రమే తమకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



'దౌర్జన్యంతో ఏకగ్రీవాలు చేసుకున్నోళ్లా మాట్లాడేది'

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు ఏ విధంగా గెలిచింది మాచర్ల ప్రజలందరికీ తెలుసని, పోలీసులను అడ్డం పెట్టుకొని దౌర్జన్యాలు చేసి ఏకగ్రీవాలు చేసుకుని గెలిచిన వాళ్లా నీతినిజాయతీల గురించి మాట్లాడేదని తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం కౌన్సిలర్ మదార్ సాహెబ్ అధ్యక్షతన ఆ పార్టీ మైనార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసిపికి మదార్ సాహెబ్ రాజీనామా చేయడాన్ని తప్పు పట్టేవాళ్ళు, కౌన్సిలర్ పదవికి ఆయన రాజీనామా చేసి తిరిగి గెలవాలని కోరేవాళ్లపై విమర్శలు చేశారు. ఆ విమర్శలు చేసిన వాళ్లు ఏ విధంగా పదవులు పొందారో చెబితే బాగుంటుందని అన్నారు. అందరం రాజీనామాలు చేసి తిరిగి ఎన్నికలకు పోదామని సవాలు విసిరారు. ఇసుక అమ్ముకునే వాళ్ళు, క్రికెట్ బెట్టింగ్ లాడించేవాళ్లు, తెలంగాణ మద్యం అమ్ముకునేవాళ్లు నాయకులైపోయారని విమర్శించారు రాజకీయాల్లో దశాబ్దాలుగా ఉన్నామని, తమపై ఎటువంటి ఆరోపణలు లేవని మదర్ సాహెబ్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ముఖ్యంగా జూలకంటి దుర్గాంబ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ముస్లిం మైనారిటీలకు వందల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఎంతోమందికి సహాయ సహకారాలు అందించారని చెప్పారు. విమర్శించేవాళ్లు తమ స్థాయిని తమ చరిత్రను గుర్తుచేసుకుని విమర్శించాలని ముస్లిం మైనార్టీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక 28, 29 వార్డులకు చెందిన గొట్టిపాళ్ల వంశస్థులు 60 కుటుంబాల వారు బ్రహ్మారెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి బ్రహ్మారెడ్డి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నాయకులు కె.శివారెడ్డి, కె. దుర్గారావు, బాబు ఖాన్, వై.కేశవరెడ్డి, సీతారెడ్డి, జి.సైదా పాల్గొన్నారు

'జూపూడి ప్రభాకర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గోదా రమేష్ కుమార్ విమర్శలు గుప్పించారు. ఆదివారం నరసరావుపేట కార్యాలయంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ మచిలీపట్నంలో శనివారం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో విదేశీ విద్యకు రూ 15 లక్షలు ఇచ్చారని, వైసిపి హయాంలో విదేశీ విద్యకు రూ.50 లక్షలకు పైగా ఇస్తున్నారని ఇంత ఎక్కువ మొత్తం ఇస్తున్న విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు తీసేసి జగన్ పేరును పెట్టినా ఆనందమేనని జూపూడి ప్రభాకర్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. వైసిపి అధిష్టానం మెప్పుకోసం అంబేద్కర్‌ను ఎవరితోనైనా పోలిస్తే సహించేది లేదన్నారు. తక్షణమే అంబేద్కర్ వాదులకు,దళిత బహుజనులకు ఆంధ్రప్రదేశ్ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ కాళ్ళు పట్టుకొని క్షమాపణలు చెప్పాలని అన్నారు.

నేడు కళ్యాణమండపం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలం లోని 75 తాళ్లూరులో రూ.2 కోట్లతో నిర్మించనున్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపానికి పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు నంబూరు శంకరరావు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వెంకటేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు.

జంగమహేశ్వరపాడు ఘటనలో బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి కార్యకర్తలపై దాడులకు పాల్పడి, భయ భ్రాంతులకు గురి చేస్తూ రానున్న ఎన్నికల్లో గూండాయిజం చేసి గెలుపొందాలని చూస్తున్న వైసిపి నాయకులకు పల్నాడు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు అన్నారు. మాచర్ల నియో జకవర్గం దుర్గి మండలం జంగమహేశ్వరపాడు ఘటనలో వైసిపి వర్గీయుల చేతిలో గాయపడి నరసరావుపేటలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆదివారం ఆంజనేయులు పరామర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలపై ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు అతికిరాతకంగా దాడి చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ దాడి జరిగి మూడు రోజులవుతున్నా పోలీసులు స్పందించకపోవడంపై విమర్శలు చేశారు. ఘటనపై 307 కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారని, కానీ ఒక్క రోజులో నిందితులకు బెయిల్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వి.సింహాద్రి యాదవ్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కిరణ్, అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి జి.జనార్దన్ బాబు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మీరావలి, నాయకులు కె.బ్రహ్మయ్య, వి.రవి, కె. కోటి సుబ్బారావు, బి.విశ్వేశ్వరరావు, జి.శ్రీనివాసరెడ్డి, టి.నరసింహారావు, వై.భార్గవ్ సాయి, జి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఆంజనేయులు, అరవిందబాబు

రిజర్వేషన్ల శాతం పెంచకుండానే కులాలను చేర్చడమా?

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎస్టీ జాబితాలో అదనంగా ఎస్టీ కులస్తులను చేరుస్తూ కేంద్ర న్యా యశాఖ ఈ నెల 16వతేదీన నోటి ఫికేషన్ జారీ చేసిందని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షు లు బి. శీను నాయక్ అన్నారు.

స్థానిక ఎన్నార్టీ సెంటర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మా ట్లాడుతూ ఎస్టీ జాబితాలోకి కొత్తగా పోర్జ, బోండో పోర్జ, ఖోండ్ పోర్జ, పరం గిపోర్జ, సవరాస్, కాపు సవరాస్, మలియా సవరాస్, కొండ సవరాస్, ఖుట్టో సవరాస్ కులాలను సైతం ఎస్టీ జాబితాలోకి చేర్చారని దాని కనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని మాత్రం పెంచలేదన్నారు. రిజర్వేషన్ల శాతం పెంచకుండా ఇష్ట ను సారంగా ఎస్టి కులాలను కలపడం వలన రానున్న రోజుల్లో ఉద్యోగాల,ఇతర పరంగాను ఇబ్బందులు ఎదు ర్కొనే అవకాశాలు ఉన్నాయని ఇవన్నీ గమనించకుండా కేంద్ర ప్రభుత్వం వారి ఉనికిని చాటు కోవడం కోసం ఈ విధంగా చేయడం చాలా అన్యాయమన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభు త్వం, రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు గిరిజన మంత్రులు మాట్లాడకపోవడం సిగ్గుచే టన్నారు. ఇప్పటికైనా స్పందించి రిజర్వేషన్ శాతాన్ని పెంచి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక గౌర వ అధ్యక్షులు బి.చిన్న నాయక్, అ ధ్యక్షులు పాలపర్తి శ్రీనివా సరావు, కోశాధికారి బి.రాంబాబు నాయక్, సహాయ కార్యదర్శి దేవర డేవిడ్, ఉపాధ్యక్షులు శివ శ్రీను, వి ద్యార్థి కన్వీనర్ కె.వాగ్యా నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బి. శ్రీనునాయక్

సంతగుడిపాడులో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఉయ్యాల రామకోటయ్యకు చెందిన పూరిళ్లలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. వెంటనే స్పందించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు. ఘటనలో రూ 2 లక్షల పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. పోలీసులు, రెవిన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.ప్రభుత్వ పరంగా బాధితులను ఆదుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.



'రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి బాబు తోనే సాధ్యం'

ప్రజాశక్తి-వినుకొండ

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చంద్రబాబునాయుడు తోనే సాధ్యమని, ప్రజల భవిష్యత్తు గ్యారెంటీ అని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండలోని 28వ వార్డు ఓబయ్య కాలనీలో పట్టణ పార్టీ అధ్యక్షులు అయూబ్ ఖాన్ అధ్యక్షతన 'బాబు ష్యూరిటి- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీ.వి ఆంజనేయులు హాజరై జనసేన పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ'బాబు ష్యూరిటి- భవిష్యత్తుకు గ్యారెంటీ'పథకాలను ప్రజలకు వివరించారు. ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగు తోందని, జగన్ రెడ్డి ఒక చేత్తో 100 ఇచ్చి మరో చేత్తో వెయ్యి రూపాయలు దోచుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇసుక పాలసీతో భువన నిర్మాణ కార్మిక రంగాన్ని చిన్నభిన్నం చేసి అన్ని రంగాల కార్మికులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. ఇసుక మాఫియాతో వందల కోట్లు దోచుకున్నాడని అన్నారు. కార్పొరేషన్ నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసి ఎస్సీ,ఎస్టీ,బీసీ ముస్లిం మైనారిటీ వర్గాలను మోసం చేసిన దగా కోరు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని అన్నారు. ప్రత్యేక జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ఐదేళ్లలో ఒక డీఎస్సీ కూడా ఇవ్వని అసమర్ధ సీఎం అని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ కల్పించే చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తన స్వార్థం కోసం పట్టణ వార్డుల్లో జరగాల్సిన అభివృద్ధి నిధులను తీసుకువెళ్లి తన సొంత ఆస్తుల వద్ద రోడ్లు వేసుకున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని ఆరోపించారు. అధికారం అడ్డం పెట్టుకొని వందల కోట్లు దోచుకున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీం ఖాన్, రాష్ట్ర మైనార్టీ సెల్ కమిటీ సభ్యులు సౌడగర్ జానీ భాష ,పత్తి పూర్ణ,పి.వి.సురేష్ బాబు ,గంధం కోటి, పి. కృష్ణ, పల్లా వెంకటేశ్వర్లు, డి.నాగార్జున, పి. దాసయ్య, పి.వి.సురేష్ బాబు,మంచాల హనుమంతరావు,రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

బీసీలను, మైనారిటీలను మోసం చేశారు : టిడిపి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

బీసీలను, మైనారిటీలను నట్టేట ముంచారని, బీసీలకు 27 సంక్షేమ పథకాలు రద్దుచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్లు తక్కువ చేసిన ఘనత సైకో జగన్‌కే దక్కుతుందని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. పట్టణంలోని 26 వార్డులో ఆదివారం రాత్రి కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ వైసిపి నుంచి తమను గెలిపిస్తే ప్రత్యేక హోదా సాధిస్తామని ప్రగల్భాలు పలికి ఢిల్లీ వెళ్ళిన వైసిపి ఎంపీలు ఆ మాట మరిచిపోయి, నేరాలు, అసభ్యకరమైన పనులు చేస్తూ దేశవ్యాప్తంగా మన రాష్ట్రం పరువు తీసేస్తున్నారని విమర్శించారు. వేల పోస్టులు ఖాళీగా ఉన్నా కనీసం ఒక్క నియామక ప్రక్రియ కూడా పూర్తి చేయకుండా యువత జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యేల్లినేడి రామస్వామి రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, టిడిపి నాయకులు దరువురి నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా, జానీబాబు పాల్గొన్నారు



మత్తు పదార్థాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం

ప్రజాశక్తి - గుంటూరు

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-3 ఆధ్వర్యంలో స్థానిక కృష్ణబాబు కాలనీలో ఆదివారం ప్రత్యేక శిబిరంలో నిర్వహించారు. మద్యపానం, ధూమ పానం, గుట్కా, పొగాకు, తదితర మత్తు కలిగించే వాటికి ప్రజలు దూరంగా ఉండాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. 76వ సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికీ ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు వెళ్లి మద్యపానం, ధూమపానం నష్టాలను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతితిగా 21వ డివిజన్ కార్పొరేటర్ కె.గురవయ్య హాజరై మాట్లాడారు. మద్యపానం కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తుందని, విలువలను పతనం చేస్తుందని చెప్పారు. కార్యక్రమ నిర్వహణ అధికారి కె.సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ యువత ఎక్కువగా డ్రగ్స్, మత్తు కలిగించే ఆల్కాహాలు వంటి వాటికి బానిసై బంగారం వంటి జీవితాలను విషపూరితం చేసుకుంటోందని ఆవేదన వెలిబుచ్చారు. యువత పెడదోవ పట్టడం సమాజానికి చాలా నష్టమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్. జ్యోత్స్న కుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏపీ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ ఏర్పాటు అవసరం

కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ భవనం ప్రారంభోత్సవంలో విశాఖపట్టణం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్

ప్రజాశక్తి-తెనాలి

కో-ఆపరేటివ్ సొసైటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏపి కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ ఏర్పాటు అనివార్యమని విశాఖపట్టణం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక కొత్తపేటలోని కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ భవనంలో నూతనంగా నిర్మించిన రెండో అంతస్తును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షతన సొసైటీస్ ఫెడరేషన్ ఏర్పాటుపై జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ జాతీయ బ్యాంకులకు దీటుగా క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలు అన్ని రకాల రుణాలు అందిస్తున్నాయన్నారు. అయితే రుణాల రికవరీలో అనేక సమస్యలు ఎదురౌతున్నాయని, వాటి పరిష్కారం నిమిత్తం కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌గా ఏర్పడి, సమిష్టిగా ఆయా సమస్యలు అధిగమించవచ్చని చెప్పారు. డిఎల్ కాంతారావు మాట్లాడుతూ మొండి బకాయిల వసూలుకు కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తే తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. అయితే అర్బన్ బ్యాంకులకు సేల్ ఆఫీసర్ ద్వారా రుణాల రికవరీ అవకాశం ఉందని, అదే పంథాలో కో-ఆపరేటివ్ సొసైటీలు కూడా రుణాల రికవరీ పొందాలంటే ఫెడరేషన్‌గా ఏర్పడి సొసైటీలకు కూడా సేల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరవచ్చని వివరించారు. కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ ఏర్పాటు విధి విధానాపై చర్చించారు. సమావేశంలో జిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య, విశ్రాంత కో-ఆపరేటివ్ ఆఫీసర్ కె.కృష్ణారెడ్డి, పీపుల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఎ.పుల్లారావు, సిండికేట్ బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ సొసైటీ చైర్మన్ ఎన్.ప్రభాకర్, అనంతపూర్ సొసైటీ చైర్మన్ డి.జయచంద్రారెడ్డి, అమలాపురం కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కె.రామకృష్ణారెడ్డి, సహకార భూమి జనరల్ సెక్రటరీ కె.వెంకటకృష్ణారెడ్డి, కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, సిఇఒ కనమర్తపూడి ఝాన్సీలక్ష్మి, పిఆర్వో చెరుకూరి సతీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరావు



శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు, స్త్రీల వైద్యులు డాక్టర్ డి.శారద నిర్వహిస్తున్న డి3 శారద సర్వీసెస్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో షుగర్, బిపిలకు, గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణకు ఈసీజీ ఉచితంగా తీశారు. ధర్మ హెల్త్ వాహనాన్ని ఉపయోగించి మార్కెట్ కూడలి, పట్టణంలోని రైతు బజార్ల ప్రాంతాలలో దాదాపు 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ రోజువారి కూలీలుగా ఉన్న పేదలు, చిరు వ్యాపారులు ఆరోగ్య సమస్యలపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. కనీసం వారిలో అనారోగ్యాన్ని నిర్ధారించి వైద్యం చేయించుకునే పరిస్థితులు లేని వారు అనేకమంది ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో వారిలో అవగాహన కల్పించి, మేలు చేసేందుకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీనివాసరావు, వాలంటీర్లు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నృసింహుని కాలమాన కేలండర్ ఆవిష్కరణ


ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మిద్దె సెంటర్ శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి తిరుణాళ్ల సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్ల భక్త బృందం కమిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను మ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి ఆదివారం ఆవిష్కరించారు. ఎం.రమేష్‌బాబు, సిహెచ్.శ్రీనివాసరావు, ఎ.భూలక్ష్మి, ఎం.రమేష్‌బాబు, పి.మహేష్, పాల శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో జేవీ నారాయణ పాల్గొన్నారు.

ప్రజలు తమ హక్కులను పోరాడి సాధించుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి

హక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేయటం ద్వారానే ప్రజలు తమ జీవితాలను మెరుగు పరచు కోగలగుతారని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.చిట్టిబాబు అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా 20వ పౌర హక్కుల సంఘం మహాసభ స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ వీరేశలింగం అద్యక్షతన జరిగింది. చిట్టిబాబు మాట్లాడుతూ అధిపత్య శక్తులు, ప్రభుత్వ అణచివేత చర్యల నుండి అణచివెతకు గురైన వారు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశం లౌకిక దేశమా ! అనే అంశంపై విప్లవ రచయతల సంఘం సీనియర్ బాధ్యులు సిఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడారు. మాదకద్రవ్యాలు యువతపై ప్రభావం అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుబాబు ఉపన్యసించారు. పి.మంజుశ్రీ, షేక్ నాగర్‌వలి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్, ఎన్.నరసింహారావు, వి.పేరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ టి.రాజారావు, పి.రాజారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిట్టిబాబు

రెండే లక్ష్యాలతో రెండు దశాబ్దాలుగా

- అనాథ, పేద విద్యార్థులకు బాసటగా
- విద్యాదానంలో సావిత్రీభాయ్ పూలే ఎడ్యుకేషనల్ ట్రస్టు
- అఖిలభారత శరీర అవయవదాన ఫౌండేషన్ ద్వారా అవగాహన



దత్తత తీసుకున్న విద్యార్థులతో డాక్టర్ సీతామహాలక్ష్మి

ప్రజాశక్తి-తెనాలి/తెనాలిరూరల్

కులమతాలు, మూఢనమ్మకాలకు అతీతంగా రెండే రెండు లక్ష్యాలతో ఆ సంస్థ పనిచేస్తోంది. అందులో ఒకటి సావిత్రీభాయ్ పూలే ఆశయ సాధనలో మహాయజ్ఞంలా సాగుతున్న విద్యాదానం, రెండోది అవయవదానం. రెండూ భిన్న కోణాలే. రెండింటిలోనూ ఎన్నో సవాళ్లను అధిగమించి ఇటీవలే 20 వసంతాలను పూర్తిచేసుకున్న సావిత్రీభాయ్ పూలే ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయదాన ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

సావిత్రీభాయ్ పూలే స్ఫూర్తితో అక్షరయజ్ఞం

సావిత్రీభాయ్ పూలే ఎడ్యుకేషనల్ ట్రస్టును 2003లో స్థాపించారు. సమాజంలో నిర్లక్ష్యానికి గురవుతున్న చిన్నారులు, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, తల్లో, తండ్రో ఎవరో ఒకరు ఉండి జీవన విధానం అస్తవ్యస్తంగా ఉన్న కుటుంబాల్లో పిల్లలు, పేదరికంగా కారణంగా విద్యకు దూరమవుతున్న వారిని ఈ సంస్థ ద్వారా గుర్తించి వారి విద్యాభివృద్ధికి సహకరిస్తున్నారు. ముఖ్యంగా 90 శాతం బాలికలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. సంస్థ ప్రారంభించి 20 ఏళ్లు పూర్తిచేసుకుని, ఇటీవలే వార్షికోత్సవం జరుపుకున్న నేపథ్యంలో రెండు రాష్ట్రాల్లో 400 మంది బాలికల విద్యకు సహకరించినట్లు డాక్టర్ సీతామహాలక్ష్మి తెలిపారు. సావిత్రీభాయ్ పూలే తొలి మహిళా ఉపాధ్యాయినిగా మూఢనమ్మకాలకు అతీతంగా మహిళల్లో విద్యావ్యాప్తికి చేసిన కృషిని స్ఫూర్తిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మనిషి మరణం తరువాత కూడా జీవితం ఉంటుంది

మనిషి తనకోసం తాను జీవించటం ఒకెత్తయితే, మరణించిన తరువాత కూడా వారికి జీవితం ఉందన్న సత్యాన్ని అఖిల భారత శరీర అవయవదాన ఫౌండేషన్ ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు. ఒక దేహం 18 మంది జీవితాల్లో వెలుగు నింపొచ్చని, అది ఎలా సాధ్యమన్న వివరాలను 'మరణించినా జీవించండి' అన్న నినాదంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. దీనిలో తొలి ప్రయత్నం రక్తదానం. రక్తదానం కూడా ప్రాణదానంతో సమానమే కాబట్టి 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి తన 60వ ఏట వరకూ ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని వివరిస్తున్నారు. దీనిపై ఎంతో మంది యువకులు స్పందిస్తున్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అంటే రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్‌తో జీవన మృతులుగా ఉన్నవారు అవయవదానానికి అంగీకరిస్తే వారి నుంచి కళ్లు, గుండె, లివర్, కడ్నీలు ఇలా అవసరమైన శరీర అవయవాలను సేకరించి, మరికొంత మందికి అమర్చే విధానాన్ని అవగాహన సదస్సుల ద్వారా వివరిస్తున్నారు. ముఖ్యంగా ఒక వ్యక్తి నుంచి సేకరించిన కార్నియా ఇద్దరికి చూపునిస్తుంది. అంటే ఆ ఇద్దరికి సహాయకారులుగా ఉన్న మరో ఇరువురికీ విముక్తి లభించినట్లే. ఒక వ్యక్తి నుంచి సేకరించిన గుండెను మరో వ్యక్తికి గ్రీన్ చానల్ ద్వారా తరలించి నాలుగు గంటల్లోపు అమర్చి మరో వ్యక్తికి జీవం పోస్తున్న సందర్భాలు చూస్తూనే ఉన్నామని, ఈ ఫౌండేషన్ ద్వారా చేసిన ప్రయత్నంలో భాగంగానే జీవన్‌దాన్ యాక్ట్ కూడా 2013లో అమల్లోకి వచ్చినట్లు సంస్థ వెల్లడిస్తోంది.

శరీరదానం కూడా ముఖ్యమే..

మనిషి పుట్టిన తరువాత మరణం తప్పదు. మరణించిన తరువాత కూడా సమాజ రుణం తీర్చుకునేలా సంస్థ అవగాహన కల్పిస్తుంది. మరణం తరువాత మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు విల్ రాసి అప్పగించటం. దీనికి ఓ ప్రత్యేక యాక్టు కూడా ఉంది. ఆ యాక్ట్ ప్రకారం శరీరదానం చేస్తే, కొంత కాలం అ శరీరం మెడికల్ కళాశాలల్లో భద్రంగా ఉంటుంది. దానిని వైద్య విద్యార్థుల పరిశోధనలకు, ప్రాక్టికల్ అవగాహనకు ఉపయోగ పడుతుందని, తద్వారా వారు పరిపూర్ణమైన వైద్యులుగా శిక్షణ పొందే అవకాశం ఉంటుందని సంస్థ చెబుతోంది.

మహోన్నత లక్ష్యంతో 20 వసంతాలు

ఎంతో మహోన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని, ఆ దిశగా శ్రమిస్తున్నాం. తొలుత సావిత్రీభాయ్ పూలే స్ఫూర్తితో విద్యావాప్తికి నాంది పలికాం. 20 ఏళ్లలో సమాజంలో వివిధ కారణాలతో నిర్లక్ష్యాలనికి గురవుతున్న దాదాపు 400 మంది పైచిలుకు బాలికల విద్యకు సహకరించాం. ఎంతోమంది ప్రయోజకులయ్యారు. 'మరణించినా జీవించండి' నినాదంతో రక్తదానం, అవయవదానం, శరీరదానంపై అవగాహన కల్పిస్తున్నాం. మా ప్రయత్నం జీవన్‌ధాన్ యాక్ట్ వచ్చేందుకు దోహదపడిందని భావిస్తున్నాం. మా సంస్థ ద్వారా సామాజిక ప్రయోజనాలను గుర్తించి ప్రజలు సహకరించాల్సిందిగా కోరుతున్నాం.



డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, తెనాలి.

సామాజిక బాధ్యతతో కార్యక్రమాలు

సావిత్రిభాయ్ పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు తరఫున నిర్వహిస్తున్న విద్యాదాన కార్యక్రమాలు, అఖిలభారత శరీర అవయదాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు మంచి స్పందన లభించింది. ఇటీవలే మా కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొని రెండు సంస్థల ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. అవయవదానం, కర్తదానం, శరీరదానంపై ఉన్న అపోహలను తొలగించారు. సామాజిక బాధ్యతతో ఆ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభిలషణీయం. భవిష్యత్‌లో ఆయా సంస్థలకు మా వంతు సహకారం అందిస్తాం.



కిరణ్‌బాబు, ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్, తెనాలి

కన్నుల నిండుగా.. పిల్లల పండుగ..

రెండో రోజూ అదే జోరు.. - ముగిసిన గుంటూరు బాలోత్సవం



ప్రజాశక్తి-గుంటూరు

ఆదరణ తగ్గుతుందుకున్న కోలాటానికి ప్రాణం పోస్తూ... జానదపద నృత్యాలు... దేశభక్తి గేయాలు... వ్యర్థ పదార్థాలతో ఉపయోగపడే పరికరాల తయారీ... విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునేందుకు క్విజ్ వంటి రకరకాల ఈవెంట్లతో గుంటూరు బాలోత్సవం ఆద్యంతం కన్నుల పండుగను తలపించింది. స్థానిక హిందూ కాలేజి ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న గుంటూరు జిల్లా బాలోత్సవంలో రెండో రోజూ తరగని ఉత్సాహంతో చిన్నారులు వేలాది మంది పాల్గొన్నారు. కోలాటానికి ఆదరణ తగ్గుతుందనుకుంటున్న నేపథ్యంలో ఈ బాలోత్సవంలో దాదాపు 20 పాఠశాలల నుండి విద్యార్థులు కోలాటం ప్రదర్శించారు. జానపద నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. రెండో రోజు దాదాపు 14 ఈవెంట్లలో వేలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. ఆదివారం నాటి బాలోత్సవ ప్రాంభానికి దీప్తి పబ్లికేషన్స్ అధినేత ఎ.ఆంజనేయులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పాల్గొని సందేశమిచ్చారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో మలినేని విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి ఛైర్మన్ కోయి సుబ్బారావు, కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఎన్.వీరప్రకాష్ పాల్గొని విజేతలకు బహుమతులు అందచేశారు.

ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మున్సిపల్ పట్టణాల్లోనూ బాలోత్సవాలు నిర్వహించి, విద్యార్థులకు



మరింత చేరువ చేయటానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ ఏడాది జెడ్పీ స్కూల్స్ నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనటం శుభపరిణామం అని చెబుతూ వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. మలినేని పెరుమాళ్లు, కోయి సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఏటా వేలాది మందితో బాలోత్సవం నిర్వహిస్తున్న జెవివికి, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా రోజువారీ ఒత్తిడి అధిగమించటానికి, బృందతత్వం పెంపొందించుకోవటానికి దోహదం చేస్తుందని అన్నారు. అనంతరం ఈవెంట్ల వారీగా విజేతలకు బహుమతులను అతిథులు ప్రదానం చేశారు. ఓవరాల్‌ఛాంప్‌గా గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, రన్నర్స్‌గా బాలకుటీర్ నిలిచాయి. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, ట్రెజరర్ వెంకట్రావు, బాలోత్సవం కన్వీనర్లు డాక్టర్ ఎం.బోసుబాబు, కె.వి.ఎస్.దుర్గారావు పాల్గొన్నారు.





ఉత్తమ ఫలితాల కోసం దత్తత విధానం



- పదో తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత లక్ష్యం
- 90 శాతం పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన
- ప్రజాశక్తితో పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి మాదిగాని వెంకటేశ్వర్లు



కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన అందిస్తున్నామని, బోధన, ఉపాధ్యాయుల పని తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి మాదిగాని వెంకటేశ్వర్లు అన్నారు. వచ్చేనెల 18 నుండి నిర్వహించనున్న 10వ తరగతి పరీక్షలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వీటితోపాటు పలు అంశాలపై ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు.

పదో తరగతి పరీక్షలు ఎంత మంది రాయనున్నారు? ఏర్పాట్లు ఏమిటి?

జిల్లా వ్యాప్తంగా 127 సెంటర్లలో 30,169 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా, తాగునీరు, ఆరోగ్య సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేశాం. పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటుతోపాటు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహణకు పోలీసులు అందుబాటులో ఉంటారు.

నాడు - నేడు ద్వారా జిల్లాకు ఎన్ని కోట్లు మంజూరయ్యాయి?

నాడు-నేడు ద్వారా మొదటి విడత పనులన్నీ పూర్తయ్యాయి. రెండో విడతలో 904 పాఠశాలల్లో రూ.173 కోట్లతో తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, శుద్ధ జలం ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇప్పటికి రూ.145.72 కోట్లు విడుదలయ్యాయి.

ప్రచారానికి తగ్గుట్టు డిజిటల్ విద్యా బోధన లేదనే విమర్శలున్నాయి కదా?

అలాంటిదేమీ లేదు. 90 శాతం పాఠశాలల్లో డిజిటల్ విధానంలో విద్యా బోధన జరుగుతోంది. డిజిటల్ విద్యా బోధన పట్ల విద్యార్థులు కూడా ప్రత్యేక ఆసక్తి చూపుతున్నట్లు పాఠశాలలకు తనిఖీలకు వెళ్లిన సందర్భంలో అర్థమైంది.

పదో తరగతిలో ఉత్తీర్ణతకు తీసుకుంటున్న చర్యలు?

90శాతం ఉత్తీర్ణత సాధించాలనేది లక్ష్యం. ఇప్పటికే బోధనకు సంబంధించి పాఠ్యాంశాలు పూర్తి చేశాం. ప్రస్తుతం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశాం. ఆరవ తరగతి నుండి బోధన ప్రమాణాలు మెరుగుపరచడం ద్వారా విద్యార్థులలో సామర్థ్యం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఉపాధ్యాయుడు పిల్లల్ని దత్తత తీసుకుని మెరుగైన విద్యా బోధన అందించేలా చూడాలని ఆదేశించాం.

పదో తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం ఇస్తున్నారా?

గతంలో జెడ్పీ నిధుల నుండి 10వ తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం అందించేవారు. ప్రస్తుతం ఇటువంటి ప్రతిపాదనేమీ లేదు. గోరుముద్ద ద్వారా నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందేలా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. నిర్వాహకులకు ప్రతినెలా 6న బిల్లులు చెల్లిస్తున్నాం. ఉదయం పూట రాగిజావ అందిస్తున్నాం. గోరు ముద్దపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని, తప్పులుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించాం.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపుదలకు తీసుకుంటున్న చర్యలు?

చదువు అంటే ప్రైవేటు పాఠశాలల ఫీజులు మోత మాట వినిపిస్తుంది. బండెడు పుస్తకాలతో కుస్తీలు పట్టే పిల్లలు కళ్ల ముందు కనిపిస్తారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు తెలియని తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తారు. ప్రభుత్వ పాఠశాలలో పూర్తి అర్హతలున్న ఉపాధ్యాయులున్నా వాటి పట్ల తల్లిదండ్రులు ఆసక్తి చూపకపోవడం వంటి పరిస్థితులను ప్రభుత్వం గమనించింది. అందుకు గల కారణాలు అన్వేషించి, లోపాలను సరిదిద్ది ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులు విద్యార్థులు ఆసక్తి చూపేలా కృషి చేస్తోంది. అందులో భాగంగానే పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు నాడు-నేడు కార్యక్రమాన్ని చేపట్టింది. మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా జిల్లాలో పాఠశాల రూపురేఖలు మారుస్తోంది. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రభుత్వ విద్యా ప్రమాణాల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. ప్రస్తుతం జిల్లాలో 2041 ప్రభుత్వ పాఠశాలల్లో 319588 మంది చదువుతున్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న వైద్యారోగ్య శాఖ మంత్రి రజిని


ఘనంగా శ్రీ వైష్ణవి హాస్పిటల్స్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కాకాని రోడ్డు, బిఎస్ఎన్ఎల్ టవర్ ఎదురు డాక్టర్ కిలారి సునీల్ కుమార్, డాక్టర్ చంద్ర రాధికారాణిచే అన్ని రకాల అధునాతన వైద్య సౌకర్యాలతో రూపుదిద్దుకున్న 100 పడకల శ్రీవైష్ణవి హాస్పిటల్స్‌ను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ శాఖ మంత్రి విడదల రజని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి మనిషి ఆరోగ్యంగా జీవించటం అత్యంత ప్రధానమని, ప్రపంచ వ్యాప్తంగా వైద్యరంగంలో సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని మనిషి జీవన ప్రమాణాలను విశేషంగా పెంచుతుందని చెప్పారు. శ్రీవైష్ణవి హాస్పిటల్స్ అచిర కాలంలోనే తమ సేవలతో ప్రజల ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షిస్తూ ఈ సందర్భంగా నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్, నగర మేయర్ మనోహర్ నాయుడు, సిపిఐ జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, రామకృష్ణ, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, నగరంలోని ప్రముఖ వైద్యులు పాల్గొని సునీల్‌కుమార్ రాధికా రాణి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

బాక్సింగ్‌లో తాడేపల్లి యువకుడి సత్తా

ప్రజాశక్తి-తాడేపల్లి



అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో తాడేపల్లికి చెందిన చలాది సతీష్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం తాడేపల్లి సీతానగరంలో స్థానికులతో పాటు కుటుంబ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అభినందన సభ నిర్వహించారు. సతీష్‌ను టిడిపి నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, టిడిపి తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. సతీష్ మాట్లాడుతూ తాను ఈస్థాయికి రావడానికి కుటుంబ సభ్యుల సహకారం ఉందని తెలిపారు. ఒలింపిక్స్‌లో పాల్గొనడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, కృష్ణకుమారి, దమయంతి, కోచ్ హేమంత్‌రెడ్డి, సిహెచ్.సత్యనారాయణ, మోహనరావు పాల్గొన్నారు.